# దీపావళి

## - వి. మల్లికార్జున్

ఇంట్లోకి అడుగుపెడుతూనే చెప్పులని విసిరేసినట్టు వదిలి, భుజానికున్న బ్యాగ్‌ని తీసి నేలకోసి కొట్టాడు రామూ. వస్తూనే ముభావంగా ఉండడాన్ని గమనించిన లింగయ్య.. కొడుకు మీద చెయ్యేసి, ఏమైందన్నట్టు చూశాడు.

“నాన్నా.. నువ్వెప్పుడూ ఇంతేనే. ఇయాల్టి నించి సెలవులు గూడా ఇచ్చిర్రు. ఇంగ పది రోజులు గూడ లేదు దసరకి. స్కూల్ల అందరు బట్టలప్పుడే కొనుక్కుర్రు. నువ్వెప్పుడు కొనిస్తవే ? ఈ సారన్న కొనిస్తవా ?”

“అరేయ్.. దీనికే ఇట్ల నారాజెందుకైతవ్‌రా. ఇయ్యాల రేపు పైసలొచ్చేయున్నయ్. అయి రాంగనే కొనిస్త.”

“ఆ.. గయి వచ్చినట్టే.. నువ్వు కొన్నట్టే థీ..”

“అరే.. గిట్లుండడేందే ఈడూ? జెర నువ్వన్న చెప్పు..” అన్నాడు లింగయ్య.. ఇవేవీ పట్టనట్టు కూర్చున్న ధనమ్మను చూస్తూ.

“అమ్మేం చెప్తదిలే. ఇంగ మీరు గొనియ్యరూ, అదిగాదులే గానీ..” అంటూ కోపమ్మీదనే బయటకెళ్ళిపోయాడు.

రోజులు అలా గడుస్తూనే ఉన్నాయి. దసరా దగ్గరకెచ్చేస్తోంది. అప్పటికీ ఎక్కడా అప్పు దొరక్క ఇబ్బందులు పడుతూనే ఉన్నాడు లింగయ్య.

ఒక సాయంత్రం, “అరేయ్ రామూ.. జెర ఈ ఒక్క పాలు ఎట్లనన్న ఊకో బిడ్డా! దీపాలికల్ల ఎట్లనన్న జేశి బట్టలిప్పిస్త..” బాధగా చెప్పాడు లింగయ్య.

“నువ్వెప్పుడూ గిట్లనే జేస్తవే. పోయిన దసరగ్గుడ బట్టలు కొనియ్యవైతివి...” అతని మాటల్లో కోపం కనిపిస్తున్నా, కళ్ళు మాత్రం తండ్రి అవేదనను అర్థం చేసుకున్నట్టు సంకేతాలిస్తూనే ఉన్నాయ్.

www.sirimalle.com

చూస్తూండగానే.. దసరా, అలా వచ్చి ఇలా వెళ్ళిపోయింది.

రెండ్రోజులకు బళ్ళూ మొదలైపోయాయ్. రామూ స్కూలుకి, లింగయ్య పొలం పనికి, ఇలా ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు.

వర్షం కోసం కళ్ళు కాయలు కాచేలా చూస్తూన్నాడు లింగయ్య. కళ్ళ ముందరే చేను ఎండిపోతోంది. వచ్చిపోయే కరెంటుతో మోటార్ కాలిపోయింది. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి.

“ఏంరా లింగయ్యా, ఎన్నడురా నువ్వు తీసుకున్న అప్పు తిరిగిచ్చేదీ. ఇంకో రెణ్ణెల్లు చూస్త బిడ్డా! ఇంగ నీ ఇల్లు గుంజుకోవడం తప్ప చేసేదేం లేదు. ఎవనికి చెప్పుకుంటవో చెప్కో!”

“పటేలా.. పంట గూడ పోయేటట్టుందే, జర నువ్వే..” అంటూ లింగయ్య ముగించకముందే..

“గియన్నీ... నాకెందుకు చెప్తున్నవ్ రా... చల్‌.. ఈడ్కెంచి పో..” కోపంతో ఊగిపోయాడు నర్సింహ్మా.

కలలో కూడా లింగయ్యని కుదురుగా ఉండనివ్వలేదు నర్సింహ్మా.

*********

“అమ్మా.. దీపాలికన్న నాన్న బట్టలు కొనిస్తడంటావే..”

“ఎందుకు కొనియ్యడురా.. గా సిన్మాల నీ హీరో గాడు జేబుల చేయి పెట్టుకొని నిలబడుతడు చూడు ? అట్ల నిలబడి పోజులిద్దువుతీ..” అని ధనమ్మ అన్నదో లేదో..

“అంతేనంటవానే..” అంటూ సంబరంలో మునిగిపోయాడు.

రామూని అలా నవ్వుతూ చూసి ఎన్ని రోజులైందో.. ఆ రోజుకామె ఏమీ తినకుండా అలాగే పడుకుంది.

www.sirimalle.com

ఆరుబయట, ఒకే మంచంపై రామూ, లింగయ్య పడుకొని ఉన్నారు. ఆకాశంలోని చుక్కల్ని చూస్తూ, ఎవరి ఆలోచనల్లో వాళ్ళు పడ్డారు.

తన హీరో వేసుకున్న బట్టలేసుకొని పోజులిస్తున్నట్టు రాము, అప్పులెలా తీర్చాలన్న ఆలోచనలో లింగయ్యా అక్కడే, అలాగే, నిద్రలోకి జారుకున్నారు.

రోజులానే ఇంట్లో ఓ మూలకు దాచిపెట్టిన ఇనప్పెట్టెని తీసుకొని అందులో దాచిపెట్టున్న తన తల్లి బంగారు కడియాన్ని గుండెలకు హత్తుకొని తన రోజును ప్రారంభించాడు లింగయ్య.

ఎప్పుడూ తనకు గుండె ధైర్యాన్ని, కళ్ళల్లో ఉత్సాహాన్ని నింపే ఆ కడియం, ఆ రోజెందుకో కన్నీళ్ళు నింపింది.

*********

దీపావళికి సరిగ్గా రెండ్రోజుల ముందు, రామూని పట్నం తీసుకెళ్ళి తనక్కావల్సిన బట్టలు, బాంబులూ, అన్నీ కొనిచ్చి ఇంటికి తీసుకొచ్చాడు లింగయ్య.

దీపావళి వచ్చేరోజు వరకూ, ఓ వందసార్లకు పైనే తన బట్టల్ని చూసుకొని ఉంటాడు రామూ. ఒక నాలుగైదు సార్లు వేసుకొని మరీ చూశాడు.

దీపావళి రానే వచ్చింది. కొత్త బట్టలేసుకొని ఊరంతా రెండు సార్లు చక్కర్లు కొట్టి వచ్చాడు. ఉదయం నుంచే బాంబుల్ని కాల్చడం మొదలెట్టాడు.

“అరేయ్.. రాతిరి దాంక ఉంచురా. అప్పుడు ఇంగ బాగా కాలుద్దువుగానీ..” చేయి పట్టుకొని లాగి..

“మీయమ్మ భగారన్నం, చికన్ చేశింది. రా.. తిందువురా..” అంటూ రామూని ఇంట్లోకి తీసుకెళ్ళిపోయాడు లింగయ్య.

అందరూ ఒక్కచోట కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ తిన్నారు.

“గీ సేమ్య గూడ తినురా..” ఇక చాలన్నట్టు లేస్తున్న రామూని చూస్తూ అన్నాడు లింగయ్య.

www.sirimalle.com

“నావల్ల కాదు నాన్నా.. అమ్మా.. నువ్వన్న చెప్పు..” అమ్మ వైపు తిరిగి ప్రేమగా అడిగాడు.

“సరేలేరా నువ్వాడుకోపో.. ” అన్న మాట వినీ వినగానే సర్రున బయటకు పరిగెత్తాడు.

దీపావళి వెలుగులన్నీ రాము కళ్ళలోనే నిండిపోయాయా అన్నట్టున్నాయి అతడి కేరింతలు.

ఆ కేరింతలను అలానే చూస్తూండిపోయిన ధనమ్మ, ఏదో అడగాలని అనుకుంది కానీ అక్కడే ఆగిపోయింది. లింగయ్య కూడా ఏదో చెప్పాలనుకొని, “ధనమ్మా...” అన్నాడు కానీ అక్కడే ఆగిపోయాడు.

ధనమ్మ అడగాలనుకుని ఆగిపోయింది, లింగయ్య చెప్పాలనుకొని ఆగిపోయింది బయట అప్పుడే వెలిగిన చిచ్చుబుడ్డి వెలుగులో కలిసిపోయాయి.

రాము కళ్లల్లోని ఆనందం ఆ ప్రశ్నను ప్రశ్నలాగే మిగిల్చింది. నిజానికి ఆ ప్రశ్న బయటకొచ్చే అవకాశం కానీ, ఆ ప్రశ్నకి ఒక సమాధానాన్ని వెతకాల్సిన అవసరం కానీ అప్పటికి లేవు.